అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 175. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.27.03.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## చివరి టి20లోనూ కివీస్ గెలుపు

వెల్లింగ్టన్:అమృత్ తెలంగాణ: పాకిస్తాన్ తో జరిగిన ఐదు టి20ల సిరీస్‌ను ఆతిథ్య న్యూజి లాండ్ జట్టు కైవసం చేసు కుంది. చివరి మ్యాచ్‌కు ముందే సిరీస్‌ను చేజిక్కిం చుకున్న కివీస్ జట్టు.. నామమాత్రపు ఐదో, చివరి టి20లో ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్‌ను కివీస్ బౌలర్లు కట్టడి చేశారు. నీషమ్(5/22)కి తోడు డఫే(2/18) రాణించారు. దీంతో పాకిస్తాన్‌ను 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 128పరుగులకే కట్టడి చేశారు. అఘా సల్మాన్(52) అర్ధసెంచరీకి తోడు షాదాబ్ ఖాన్(28), హ్యారీస్(11) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. ఆ లక్ష్యాన్ని న్యూజిలాండ్ జటు 10ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పో యి 131పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ షెఫర్డ్(97నాటౌట్‌బీ 38బంతుల్లో 6ఫోర్లు, 10సిక్సర్లు)కి తోడు అలెన్(27) బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 6.2ఓవర్లలో 93పరుగులు జతచేశారు. పాకిస్తాన్ బౌలర్ ముఖీమ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

## ఢిల్లీ భగ..భగ

న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ:ఈ సీజన్‌లో అత్యధిక ఉష్ణోగ్రత దేశ రాజధాని ఢిల్లీలో నమోదైంది. సఫ్దర్‌జంగ్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 38.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది, ఇది ఇప్పటివరకు సీజన్‌లో అత్యంత వేడిగా నమోదైన రోజు బుధవారంగా వాతావరణశాఖ తెలిపింది. ఈ ఉష్ణోగ్రత నిన్నటి గరిష్ట ఉష్ణోగ్రత కంటే దాదాపు 2 డిగ్రీలు ఎక్కువ. మంగళవారం సఫ్దర్‌జంగ్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 37.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని, ఇప్పటి వరకు ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత గా అధికారులు గుర్తించారు. సోమవారం ఉదయం ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రత 36 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది, ఇది సాధారణం కంటే 4.5 డిగ్రీలు ఎక్కువ. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకారం.. కనిష్ట ఉష్ణోగ్రత 15.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది, తేమ స్థాయి 81 శాతం.. 17 శాతం మధ్య ఉంది. బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి. ఆగ్రాలో 35 డిగ్రీల సెల్సియస్, పాట్నాలో 30, లక్నోలో 35, జైపూర్‌లో 33, ఇండోర్‌లో 33,

# ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సిట్

# వ్యసనాలకు తెలంగాణలో తావులేదు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఆన్‌లైన్‌యాప్‌లు, రమ్మీ, బెట్టింగులు, డిజిటల్ బెట్టింగ్ గేమ్‌లపై కఠినంగా వ్యవహరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం అసెంబ్లీలో పద్దు లపై చర్చ సందర్భంగా శాంతిభద్రతలపై పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలకు ఆయన సమాధానమిస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై ప్రచారం కల్పించేవారిని విచారించడం ద్వారా మాత్రమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదన్నారు. పక్క రాష్ట్రాలు, పక్క దేశాల్లో కూడా విచారణ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ మేరకు చర్యలు తీసుకునేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ (సిట్)ను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరైనా బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించినా, నిర్వహణలో భాగస్వాములైనా వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే చట్ట సవరణ చేసి శిక్షను పెంచుతామని హెచ్చ రించారు. వ్యసనాలకు తెలంగాణలో తావులేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయని కొందరు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏ చిన్న సంఘటన జరిగినా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరి స్తోందని తెలిపారు. నడిబజారులో న్యాయవాద దంపతులను నరికి చంపితే ఆనాటి ప్రభుత్వం స్పందించలేదని గుర్తు చేశారు. ఆనాటి వెటర్నరీ డాక్టర్ లైంగిక దాడి ఘటన విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. మహిళలపై జరిగిన లైంగిక దాడుల్లో 2020లో దేశంలోనే రాష్ట్రం నాలుగో స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. బాధితులపై సానుభూతితో ఉండి, నేరగాళ్లపై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు.

**దురుద్దేశంతో మాట్లాడుతున్నారు..**

ప్రతిపక్షాలు దురుద్దేశంతో మాట్లాడుతున్నాయనీ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. శాంతిభద్రతలు క్షీణించాయని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధిపై యాసిడ్ దాడుల మాదిరిగా ఆవేశంతో దాడులు చేస్తున్నార ని తెలిపారు. రాష్ట్రాన్ని దివాళా తీయించి తెలంగాణ ప్రతిష్టను మసకబార్చేలా కుట్రలు చేస్తున్నారని వాపోయా రు. ఈ కుట్రలను తెలంగాణ సమాజం సహించదని హెచ్చరించారు. అధికారం లేకపోతే క్షణం కూడా ఉండలేమన్న తరహాలో వారు(బీఆర్ఎస్) వ్యవహరిస్తు న్నారని తెలిపారు. ఇది తెలంగాణ సమాజానికి ఏ రకంగా మేలు చేస్తుందో చెప్పాలని బీఆర్ఎస్ నేతలను నిలదీశారు. 15 నెల్లుగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పాలన సాగిస్తున్నామని చెప్పారు. అప్పుడే మీకు అంత అసహనం ఎందుకు?అని ప్రశ్నించారు. కడుపునిండా విషం పెట్టుకుని ఎందుకు మాట్లాడుతున్నారని నిలదీశారు. ప్రతిపక్ష నాయకుడిగా జానారెడ్డి లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలనీ, ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి మంచి సూచనలివ్వాలని కోరారు.

**గతంలోని రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా?**

రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయని జోరుగా ప్రచారం చేస్తున్నారనీ, వీరు (బీఆర్ఎస్ నేతలు) హడావిడి చేసినంత మాత్రాన ఎన్నికలు రాబోవని సీఎం తేల్చి చెప్పారు. 2028లోనే ఎన్నికలొస్తాయని తెలిపారు. ఆనాడు పార్టీ మారిన వాళ్లు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసినా.. ఉప ఎన్నికలు రాలేదని గుర్తు చేశారు. గతంలోనే రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని ప్రశ్నించారు. గతంలో ఆచరించిన సంప్రదాయాలనే ఇప్పుడూ ఆచరిస్తున్నామని తెలిపారు. సభ్యులెవరూ ఆందోళన చెందొద్దనీ, ఏ ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. తమ దృష్టి ఉప ఎన్నికలపై లేదనీ, రాష్ట్రాభివృద్ధిపైనే తమ ధ్యాసంతా ఉందని తెలిపారు. బీఆర్ఎస్‌లో కొందరి మధ్య ఉన్న పోటీ రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పిగా మారుతోందని ఎద్దేవా చేశారు. 'మమ్మల్ని బదనాం చేసినంత మాత్రాన మీరు మంచి వారు కాలేరని చెప్పారు. తాము వివక్ష చూపబోమనీ, అది తమ విధానం కాదని తెలిపారు. డాంబికాలతో తమ ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశపెట్టలేదని స్పష్టం చేశారు. చేసేదే చెప్తాం.. చెప్పిందే చేస్తామన్నారు.

**ఆ భూమిలో గుంటనక్కలున్నాయి..**

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూములను ప్రభుత్వం అమ్మబోతుందంటూ వస్తున్న వార్తలపై సీఎం మాట్లాడుతూ ఆ భూమి కోసం గుంటనక్కలు పొంచి ఉన్నాయనీ, వాటికి గుణపాఠం చెబుతామని సీఎం ఈ సందర్భంగా హెచ్చరించారు. రాష్ట్రాభివద్ధి కోసం ప్రభుత్వం భూసేకరణ చేస్తుంటే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 25 ఏండ్ల కింద బిల్లీరావుకు గచ్చిబౌలిలో భూమిని కేటాయించారని వివరించారు. ఆ భూమితో సెంట్రల్ యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఇప్పటి వరకు బిల్లీరావు నుంచి భూమిని వెనక్కు తీసుకోలేదన్నారు. ఓపెన్ ఆక్షన్ ద్వారా పెట్టుబడుల కోసం అంతర్జాతీయ సంస్థలకు ఆ భూములను ఇవ్వాలని ముందుకు వస్తే.. అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులకు తీసుకొచ్చేందుకు అక్కడ పరిశ్రమలను విస్తరించాలనుకుంటున్నామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించాలా? వద్దా? హరీశ్‌రావు సమాధానం చెప్పాలని నిలదీశారు. రేడియల్ రోడ్లు వేయాలా? వద్దా? చెప్పాలన్నారు. అభివద్ధి కోసం భూములు సేకరించాలా? వద్దా? ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలా? వద్దా? అంటూ సభ్యులను నిలదీశారు. కొండపోచమ్మ సాగర్ నుంచి ఫామ్ హౌస్‌లకు డైరెక్టు కాలువలు తీసుకెళ్లింది ఎవరో అందరికీ తెలుసన్నారు. ప్రతీది అడ్డుకోవాలనే కుట్ర ఏ రకంగా మంచిది? అని ప్రశ్నించారు. మీ కుట్రలు, కుతంత్రాలకు, అసెంబ్లీలో మైకును వాడుకుంటామంటే ఒప్పుకోబోమని స్పష్టం చేశారు. అభివృద్ధి, భూసేకరణ విషయంలో అడ్డుపడొద్దని సూచించారు. పరిహారం ఎలా ఇవ్వాలో సూచనలు చేయాలన్నారు. ఇది ప్రభుత్వ ఖజానా నుంచి ఇచ్చేదే తప్ప.. ఎవరి ఇంట్లో నుంచి ఇచ్చేది కాదని చెప్పారు. మల్లన్న సాగర్ లో, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కేసులు వేయించింది, పార్టీలో చేర్చుకున్నది వాళ్లేనని(బీఆర్ఎస్) తెలిపారు. 'మేం వివక్ష చూపం.. ఉత్తుత్తి బడ్జెట్.. ఊదరగొట్టే బడ్జెట్ మేం పెట్టలేదు. చేసిందే చెబుతాం.. చేసేదే చెబుతాం. గతంలో కాగితాల మీద బడ్జెట్ పెట్టారు. కాగ్ మొట్టికాయలు వేసినా వారు మారలేదు' అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి





హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రామోజీ ఫిలీం సిటీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ డిమాండ్ చేసింది. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని అక్రమంగా అరెస్టు చేయటాన్ని ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం పేదలకిచ్చిన ఇండ్ల స్థలాలను, రోడ్లను, 350 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం భూ కబ్జాదారని విమర్శించారు. ఆ సంస్థపై కేసు నమోదు చేయాలనీ, పేదల ఇండ్ల స్థలాలకోసం ఆ భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాల హక్కుదారులను అరెస్టు చేయటం సిగ్గుచేటని విమర్శించారు. రామోజీ ఫిలింసిటీ వద్ద నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన 700 మంది పేదలకు ఒక్కొక్కరికి 60 గజాల చొప్పున 2007 సంవత్సరంలో ప్రభుత్వం పట్టాలిచ్చిందని తెలిపారు. ఆ భూమి మీదకు ప్రజలు వెళ్లి నివాసం ఏర్పాటు చేసుకోకుండా రామోజీ సంస్థ వాటిని ఆక్రమించి చుట్టూ గోడ నిర్మించిందని పేర్కొన్నారు. తమ స్థలాల్లోకి వెళ్ళిన 75 మంది పేదలపై అక్రమ కేసులు పెట్టి సంవత్సరాల తరబడి కోర్టులు చుట్టూ తిప్పిందని గుర్తు చేశారు. పేద ప్రజలకు వారి ఇంటి స్థలాలను అప్పగించి, ఇండ్లు నిర్మించుకోవడానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు

## ఉగాది నుంచి సన్నబియ్యం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెల్ల రేషన్ కార్డు దారులకు ఉగాది నుంచి సన్న బియ్యం ఇవ్వనున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలి పారు. బుధవారం శాసనసభలో జరిగిన వివిధ శాఖల వద్దులపై చర్చ సందర్భంగా మంత్రి సమాధానమిస్తూ.. రాష్ట్రంలో 89.1 లక్షల రేషన్ కార్డులకు ఏటా 24లక్షల మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అదిస్తున్నామని చెప్పారు. అయితే ఆ బియ్యం పక్కదారి పడుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రంలోని తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబాల్లో ప్రతి ఒక్కరికీ 6 కిలోల సన్న బియ్యాన్ని అందించనున్నామని చెప్పారు. రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి ఆహార భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. బియ్యంతో పాటు త్వరలో ఇతర నిత్యావసర వస్తువులను కూడా చౌకధరల దుకాణాల ద్వారా అందించనున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికి ఏప్రిల్ నుంచి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. భౌతికంగా కార్డుల జారీలో ఆలస్యమైనా పోర్టల్‌లో పేరున్న వారికి సన్న బియ్యాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. రేషన్‌కార్డు ఉన్న వారు రాష్ట్రంలో ఎక్కడైనా సరుకులు తీసుకునే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. నీటి పారుదల ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌లో పెట్టిన నిధుల్లోంచి సగం వరకు గత ప్రాజెక్టులకు తెచ్చిన అప్పులు, వాటి వడ్డీలు చెల్లించేందుకే వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను ప్రభుత్వం సమ దృష్టితో చూస్తోందని తెలిపారు. నిధుల కేటాయింపులో ప్రాంతాల వారీగా ఎలాంటి వివక్షను పాటించడం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని అన్నారు. డీపీఆర్‌లో షీట్ పైల్స్ ఉ ంటే.. నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారని చెప్పారు. కాళేశ్వరం తప్పిదాలకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం దురదృష్టకరమనీ, బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉ ందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామన్నారు. తక్కువ ఖర్చుతో త్వరితగతిన ఎక్కువ ఆయకట్టుకు నీరిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు

## సహకార బ్యాంకులపై కేంద్రం నియంత్రణ



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: సహకార బ్యాంకులపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణకు అధికారం ఇచ్చే బ్యాంకింగ్ చట్ట సవరణ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బిల్లును మూజువాణి ఓటుతో బుధవారం ఆమోదించారు. ఈ బిల్లులో కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ రాష్ట్ర సహకార బ్యాంకు బోర్డులో పనిచేయడానికి అనుమతినివ్వడం వంటి వివాదాస్పద నిబంధనలు ఉన్నాయి. గత డిసెంబర్‌లో లోక్‌సభ ఈ బిల్లును ఆమోదించింది. బ్యాంకు ఖాతాదారులు నలుగురిని నామినీలుగా సిఫార్సు చేయొచ్చు. బ్యాంకుల్లో డైరెక్టర్ల 'గణనీయమైన వడ్డీ' పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.2 కోట్లకు లేదా షేర్లలో 10 శాతానికి పెంచుతారు. ప్రతినెలా ప్రతి రెండు, నాలుగో శుక్రవారం 15, 30 తేదీల్లో బ్యాంకులు నివేదికలు సమర్పిస్తాయి. సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీకాలం (ఛైర్మన్, పూర్తి కాల డైరెక్టర్ మినహా) ఎనిమిదేళ్ల నుండి పదేళ్లకు పెంచారు. బ్యాంకులు ఆడిటర్ల వేతనాన్ని నిర్ణయించడం వంటి మార్పులు కూడా కొత్త బిల్లులో ఉన్నాయి. అయితే, బ్యాంకింగ్ రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా భద్రతా ప్రమాణాలను బిల్లులో చేర్చలేదని ప్రతిపక్షం విమర్శించింది. చర్చలో పాల్గొన్న సిపిఎం ఎంపి వి. శివదాసన్ సహకార బ్యాంకులపై నియంత్రణను కేంద్రీకరించడమే కేంద్ర ప్రభుత్వ చర్య అని విమర్శించారు. డిజిటల్ యుగానికి అనుగుణంగా బ్యాంకింగ్ రంగంలో మరింత భద్రతా చర్యలు చాలా అవసరమని, అయితే, దానిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. నిరార్థక ఆస్తులను తిరిగి పొందడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. నిరార్థక ఆస్తులను తిరిగి పొందడానికి అన్ని చర్యలూ తీసుకుంటామని ప్రభుత్వం చేస్తున్న వాదన అబద్ధమని పేర్కొన్నారు.

మరోవైపు గుజరాత్‌లోని ఆనంద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ (ఐఆర్ఎంఎ)ను దేశంలో మొట్టమొదటి సహకార విశ్వవిద్యాలయంగా మార్చే 'త్రిభువన్ సహకారి బిల్లు'ను లోక్‌సభ ఆమోదించింది. కేంద్ర సహకార మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టిన ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఈ బిల్లు దేశంలో సహకార రంగానికి చాలా కీలకమని ప్రభుత్వం పేర్కొంది. సహకార రంగంలో పనిచేయడానికి ఏటా ఎనిమిది లక్షల మందికి అవసరమైన శిక్షణ అందించనున్నట్లు అమిత్ షా తెలిపారు. సిపిఎం లోక్‌సభ ఎంపి కె రాధాకృష్ణన్ సహా సభ్యులు ప్రతిపాదించిన కీలకమైన సవరణలను తిరస్కరించారు. ఆ తరువాత బిల్లు ఆమోదం పొందింది. బిల్లులోని అంశాలకు సంబంధించి ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు అమిత్ షా స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు.

## అప్రజాస్వామ్యం...మాట్లాడేందుకు అవకాశమివ్వటం లేదు.....




న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభ నడుపుతున్న తీరు సరిగ్గా లేదని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విమర్శించారు. బుధవారం పార్లమెంట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా తీరుపై రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ సభ నడుపుతున్న తీరు సరిగ్గా లేదనీ, ఇది అప్రజా స్వామికమని వ్యాఖ్యానించారు. సభలో ఏం జరుగుతుందో తనకు అర్థం కావడంలేదనీ, ఎన్నిసార్లు అభ్యర్థించినా స్పీకర్ తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని అన్నారు. బుధవారం సరైన కారణం లేకుండా స్పీకర్ సభను వాయిదా వేశారని విమర్శించారు. తాను మాట్లాడేం దుకు ఎప్పుడు లేచి నిలబడ్డా స్పీకర్ మాట్లాడనివ్వడం లేదని అన్నారు. కనీసం మాట్లాడనివ్వకపోతే తమ వాయిస్‌ను ఎలా వినిపించాలని ఆయన ప్రశ్నించారు. తనను ఒక్క ముక్క కూడా మాట్లాడనివ్వలేదని అన్నారు. గడిచిన ఏడెనిమిది రోజులుగా స్పీకర్ తన విషయంలో ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇది ప్రభుత్వ కొత్త వ్యూహమనీ, సభలో ప్రతిపక్షాలకు చోటులేదని ఆరోపించారు. ఇటీవల లోక్‌సభలో ప్రధాని మోడీ కుంభమేళాపై ప్రసంగం చేసినప్పుడు కూడా తాను మాట్లాడేందుకు ప్రయత్నించాననీ, అప్పుడు కూడా స్పీకర్ తనకు అనుమతి ఇవ్వలేదని రాహుల్‌గాంధీ ఆరోపించారు. స్పీకర్ ఉద్దేశం ఏమిటో తనకు అర్థం కావడం లేదని అన్నారు. ప్రతిపక్ష నేత రూల్ 349కు అనుగుణంగా నడుచుకుంటారని భావిస్తున్నామంటూ స్పీకర్ సభను వాయిదా వేయడాన్ని రాహుల్‌గాంధీ తప్పుబట్టారు. రూల్ 349కు విరుద్ధంగా తాను ఏం చేశానని ప్రశ్నించారు. ప్రధాని మోడీ కుంభమేళాపై ప్రసంగిస్తుండగా తొక్కిసలాటలో మరణించినవారి గురించి ప్రస్తావించాలంటూ ప్రతిపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేశారనీ, కానీ ప్రధాని తొక్కిసలాట మృతులకు కనీసం సంతాపం కూడా తెలియ జేయలేదని రాహుల్ గాంధీ విమర్శించారు. పైగా స్పీకర్ రూల్ 372ని విధించారనీ, ఈ రూల్ ప్రకారం ప్రధానిగానీ, మంత్రిగానీ మాట్లాడుతున్న ప్పుడు ఇతర సభ్యులు ఎలాంటి ప్రశ్నలూ వేయకూడదని రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష నాయకుడికి మాట్లాడే అవకాశముంటుందనీ, కానీ వీళ్లు మాత్రం తనను మాట్లాడనివ్వడంలేదని ఆరోపించారు. సభా కార్యక్రమాలు అప్రజ్వామిక విధానంలో సాగుతున్నాయనీ, కీలక అంశాలను ప్రస్తావించేందుకు తాను పలుమార్లు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. మాట్లాడేందుకు అవకాశమివ్వాలని ఆయనను (స్పీకర్) కోరుతున్నప్పటికీ అనుమతించడం లేదని చెప్పారు. ఇది సభ నడిపే పద్ధతి కాదన్నారు. మహాకుంభమేళా గురించి ఇటీవల ప్రధాని మాట్లాడినప్పుడు తాను నిరుద్యోగం గురించి మాట్లాడాలను కున్నాననీ, కానీ పలుమార్లు అడ్డుకట్ట వేశారని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. "నేనేమీ చేయలేక కూర్చుండి పోయాను. ఇప్పటికీ నేను మాట్లాడేందుకు ఎప్పుడు లేచి నిలబడినా మాట్లాడకుండా అడ్డుకుంటు న్నారు. ఇక్కడ ప్రజాస్వామ్యానికి చోటు లేదు" అని అన్నారు. దీనికి ముందు, బుధవారం సభా కార్యక్రమాల సమయంలో స్పీకర్ ఓంబిర్లా రాహుల్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ%ా% సభ గౌరవాన్ని కాపాడేం దుకు నిబంధనలను పాటించాలని సూచించారు. సభ్యుల ప్రవర్తన సభా ప్రమాణాలకు అనుగుణంగా ఉండటం లేదని పలుమార్లు తన దృష్టికి వచ్చిందన్నారు. "ఈ సభలో తండ్రీకూతురు, తల్లీ కుమార్తె, భార్యాభర్తలు సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సందర్భాల్లో ప్రతిపక్ష నేత 394 నిబంధన ప్రకారం నడుచుకుంటారని ఆశిస్తున్నాను" అని అన్నారు.

## బెట్టింగ్ యాప్ వ్యవహారంలో భూపేష్ బాఘేల్ నివాసంలో సిబిఐ సోదాలు



రారుపూర్ :అమృత్ తెలంగాణ: ఛత్తీస్‌గఢ్ మాజీ సిఎం భూపేష్ బాఘేల్‌కి వరుస కేసులు చుట్టుముడుతున్నాయి. ఇటీవల మద్యం కుంభకోణానికి సంబంధించి ఇడి ఆయన నివాసంలో సోదాలు నిర్వహించింది. తాజాగా మహదేవ్ బెట్టింగ్ యాప్ ముడుపుల కేసులో సిబిఐ అధికారులు బుధవారం ఆయన నివాసంలో సోదాలు నిర్వహిస్తున్నారు. మహదేవ్ బెట్టిగ్ యాప్ ప్రమోటర్ల నుంచి భూపేష్ బాఘేల్ రూ. 508 కోట్ల ముడుపులు అందాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిబిఐ అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. ఆ యాప్ యజమాని శుభమ్ సోని.. బఘేల్‌కు తనకు సంబంధాలు ఉన్నాయని, వందలాది కోట్ల రూపాయలను బఘేల్‌కు ముడుపులుగా ఇచ్చినట్టు అంగీకరించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో ఇడి ఇప్పటికే విచారణ చేపట్టింది. మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై భూపేశ్ బాఘేల్, ఆయన కుమారుడు చైతన్య బఘేల్ నివాసంలో ఇడి అధికారులు దాడులు చేసిన విషయం తెలిసిందే.

# చందా - టి గ్రామంలో నిర్మిస్తున్న మహాలక్ష్మీ, రేణుక ఎల్లమ్మ ఆలయాలను సందర్శించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



బోరంచు శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న చాందటి గ్రామస్తులు



చాందటి గ్రామస్తులతో మాట్లాడుతున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఎన్నో ఏళ్ళ చరిత్ర కలిగిన చందా టి గ్రామంలోని మహాలక్ష్మీ ఆలయం పునర్నిర్మాణం చేసుకోవడం తో ఈ ప్రాంతం ఆధ్యాత్మికముగా మరియు సాంస్కృతిక కేంద్రంగా మారే అవకాశం ఉందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గ్రామస్థులు, ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నేడు చందా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి శాలువాతో సన్మానించడం జరిగింది. అనంతరం గ్రామంలో ఎల్లమ్మ కళాకారులచే నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించడం జరిగింది. ఎల్లమ్మ ఆట కళాకారులూ ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మిస్తున్న రెండు ఆలయాలకు గానూ ఏవైనా సమస్యలు ఉంటె వాటిని తీర్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇవ్వడం జరిగింది.

కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపిపి అట్ల గోవర్ధన్ రెడ్డి , యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, కాంగ్రెస్ నాయకులు ఎస్ వినోద్, పోచురామ్ , దేవన్న, రాజన్న, ప్రభాకర్, ఆరె రామకిష్టు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, ఎల్లమ్మ ,మహాలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బాసర్ నుండి మాహూర్ కు జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రతిపాదన పంపండి

## అర్లీ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు ఇవ్వండి

## శాసనసభలో ఎమ్మెల్యే పవా ర్ రామారావు పటేల్



అసెంబ్లీలో ముథోల్ నియోజకవర్గంలోని పలు సమస్యలపై మాట్లాడిన ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా బాసర మార్చ్ 26 అమృత్ తెలంగాణ బాసర, జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం నుండి మహారాష్ట్రలోని మహూర్ రేణుక మాత టెంపుల్ 70 కిలోమీటర్ల దూరంలో ఉంటుందని, జాతీయ రహదారి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన పంపాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కోరారు. బాసర టు మహూర్ కు జాతీయ రహదారి కావాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ని కలవడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన పంపిస్తే తప్పకుండా ఆమోదిస్తామని ఆయన చెప్పారన్నారు. ఈ విషయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించి, ప్రతిపాదన పంపిస్తే మా ప్రాంత ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వ హాయంలో అర్లి బ్రిడ్జి నిర్మాణానికి 56 కోట్ల నిధులు మంజూరు అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకుందని, తక్షణమే హం పథకం కింద ఈ బ్రిడ్జిని పూర్తి చేయాలన్నారు. ఆర్లే బ్రిడ్జి నిర్మాణం జరిగితే లోకేశ్వరం, కుంటాల, బాసర, బైంసాతో పాటు అన్ని మండలాల ప్రజలకు రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

## మైనార్టీ నాయకులు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పుత్లిబౌలి లోని ఉర్దూ భవన్ లో కాంగ్రెస్ నాయకులు సమ్ము, రహీం, అఫ్సర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ శాంతిని, సోదరభావాన్ని సూచించే రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ముబారక్, ముర్తుజా, నాయకులు ఇర్ఫాన్, ఫిరోజ్, వాసిం రంజాని, కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షులు వసీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# బుల్లెట్ బండి ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలు,...

## అతివేగంతో మద్యం మత్తులో ఢీ కొట్టిన యువకుడు..



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళ



అతి వేగంతో బుల్లెట్ బండి నడిపి మహిళను ఢీకొని గాయపడ్డ గజేందర్

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చ్ 26 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని తురాటి ఎక్స్ రోడ్డు వద్ద సాయంత్రం 7 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు అక్కడున్నవారు తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ నుండి ఆర్టీసీ బస్సులో తురాటి ఎక్స్ రోడ్ వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా బైంసా వైపు నుండి నిర్మల్ వైపు అతివేగంతో మద్యం మత్తులో కుంటాలకు చెందిన గజేందర్, అనే యువకుడు బుల్లెట్ బండి తో మహిళను ఢీకొనడంతో తురాటి, గ్రామానికి చెందిన కండక్టర్ నారాయణ, భార్య కు తీవ్ర గాయాలు కావడంతో 108 కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొని గాయాల పాలైన ఇద్దరిని నిర్మల్ ఏరియా హాస్పిటల్ కు తీసుకెళ్లడం జరిగింది

# అ'న్యాయ'మూర్తి! అవినీతిపరుడైన




అమృత్ తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరికి ఏ అన్యాయం జరిగినా కోర్టు మెట్లెక్కుతారు. అది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు. పాలకులు, అధికారులు, పోలీసులు చేయలేనిది కోర్టు చేస్తుందనే నమ్మకం. ఆ నమ్మకమే అపనమ్మకమైతే? అధికారంతో కుమ్మక్కయితే? అవినీతిలో కూరుకుపోతే? ఇలాంటివన్నీ నేడు పౌర సమాజాన్ని వేధిస్తున్న ప్రశ్నలు. ఎందుకంటే, న్యాయంపై నమ్మకం సన్నగిల్లే ఓ అవినీతి బండారం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో బయటపడింది. ఆయన అధికారిక నివాసంలో దొరికిన నోట్లకట్టల మూట అనేక అనుమానాలకు తావిస్తోంది. దీనిపై విచారించేందుకు సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో అంతర్గత కమిటీ వేసింది. ఢిల్లీ హైకోర్టు రిజిస్ట్రీ అయితే ఆయన్ను విధులకు దూరంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. కొలీజియం సమావేశమై వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ విధంగా శరవేగంగా జరుగుతున్న పరిణామాలు, టీవీల్లో, మాధ్యమాల్లో వర్మ వ్యవహారంపై నడుస్తున్న చర్చలు ఒక రకంగా న్యాయ వ్యవస్థకే పెను కళంకాన్ని తెచ్చిపెట్టాయి. అసలేం జరిగింది? ఎలా జరిగింది? అన్న అంశాలకంటే న్యాయవ్యవస్థలో ఏం జరుగుతుందన్నది అలోచించడం చాలా ముఖ్యం. మార్చి14న ఢిల్లీలోని యశ్వంత్ వర్మ నివాసంలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించడంతో స్టోర్ రూమ్‌లోని అనేక వస్తువులతో పాటు కోట్ల రూపాయలు కాలిపోయినట్టు పోలీసులు గుర్తించారు. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రాథమికంగా విచారణ చేపట్టిన ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా మాత్రం జడ్జి ఇంటి ఆవరణలో సగం కాలిన నోట్లు, ఇతర శిథిలాలను తర్వాత రోజు తొలగిస్తున్న దృశ్యాలను ఆధారాలతో సహా ఛీఫ్ జస్టిస్ డి.కె.ఉపాధ్యాయకు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. వర్మ నివాసంలో నగదు ఫొటోలు, వీడియోలతో సహా అంతర్గత విచారణ నివేదికను సమాచారం నిమిత్తం ఈనెల ఇరవై రెండున సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో అఫ్‌లోడ్ చేసింది. అయితే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ వర్మ మాత్రం డబ్బు దొరికిన విషయం ధృవీకరించడం లేదు. 'అగ్ని ప్రమాద సమయంలో మేము భోపాల్‌లో ఉన్నామని, డబ్బు సంచులు అక్కడికి ఎలా వచ్చాయో, నేను ఇంతవరకు చూడలేదని' చెప్పారు. అంతేకాదు, దీన్ని కుట్రగా అభివర్ణించారు. తనపై వచ్చిన అభియోగాలపై హుందాగా విచారణ ఎదుర్కోవాల్సిన వ్యక్తి దాన్ని విస్మరిస్తూ మాట్లాడటం విచిత్రం. దీన్ని సీరియెస్‌గా తీసుకున్న భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా విచారణ చేస్తుండగానే అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ సీజేఐకి ఓ లేఖ రాసింది. అది న్యాయవ్యవస్థలోనే పెను దుమారాన్ని రేపింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న యశ్వంత్‌ను ఇక్కడకు ఎలా బదిలీ చేస్తారని ఆ లేఖలో ప్రశ్నించింది. ఆ 'చెత్త' మాకొద్దంటూ తీవ్ర పదజాలాన్ని ప్రయోగించింది. బార్ వాదనను పరిశీలిస్తే గనుక వర్మ అక్కడ కూడా ఇలాగే ఉన్నారన్న అనుమానం కలగక మానదు. లెక్కలేని డబ్బు బయటపడిన నేపథ్యంలో వర్మ గతంలో ఇచ్చిన తీర్పులన్నీ మరోసారి విచారించాలనే వాదన కూడా నెటిజన్ల నుంచి వస్తున్నది. ఎంతో మంది దోషులను నిర్దోషులుగా మారిస్తేనే ఈ డబ్బు నజారానా వచ్చిందనే విమర్శలకు దొరికిన నగదు బలాన్ని చేకూరుస్తున్నది. ఈ అంశంపై పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టాయి. జడ్జి ఇంట్లో కరెన్సీ కట్టలు దొరికిన అంశంపై చర్చించాలని సీపీఐ(ఎం) ఎంపీ శివదాసన్‌తో సహా ప్రతిపక్షాలు నోటీసులు జారీచేశాయి. పాలక పక్షం ఈ అంశంపై చర్చించకపోగా ఉనికిలో లేని అంశాల్ని ముందుకు తెచ్చి అసలు విషయాన్ని దాటవేసింది. ప్రజాస్వామ్యంలో పారదర్శకతకు పెద్దపీట వేసే న్యాయవ్యవస్థ ఈ విధంగా దిగజారడం సామాన్యులను సైతం కలవర పరుస్తున్నది. ప్రస్తుత పెట్టుబడిదారి సమాజంలో డబ్బే కేంద్రంగా ఉంది. అది అవినీతిగా మారి ప్రజాస్వామ్య మౌలిక విభాగాలన్నింటినీ విస్తరించింది. దాన్ని తగ్గించే కృషి చేయాల్సింది పోయి బలోపేతం చేసే పాలన దేశాన్ని నడిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో న్యాయం ఏ విధంగా సామాన్యుడికి అందుతుంది? దశాబ్దకాలంగా ఈ చర్చ జరుగుతూనే ఉంది. తమకు అనుకూలమైన తీర్పునిచ్చినందుకు జస్టిస్ రంజన్ గగోయ్ ని రాజ్యసభ పదవిని కట్టబెట్టగా, జస్టిస్ అబ్దుల్ నజీర్ పదవీ విరమణ కాగానే గవర్నర్ బహుమతిని అందుకున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితిలో స్వతంత్ర హోదాలో పనిచేయాల్సిన న్యాయవ్యవస్థ పారదర్శకత పాటించడం, ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడం సాధ్యమేనా? అందుకే 'న్యాయం గెలుస్తుందన్నమాట నిజమేకానీ గెలిచేదంతా న్యాయం కాదు' అంటారు శ్రీశ్రీ. జస్టిస్ వర్మ ఇంట్లో దొరికిన నోట్ల కట్టలపై సమగ్ర విచారణ చేసి నిజాల్ని వెల్లడించాలి. అధికారంలో ఉన్నవారు న్యాయ విలువల్ని కాపాడాలి. లేదంటే నేడు వర్మ గురించి మాట్లాడుకున్నట్టే, రేపు ఇంకొకరి గురించి కూడా మాట్లాడుకోవాల్సి వస్తుంది.



అమృత్ తెలంగాణ బ్యూరో
సీనియర్ రిపోర్టర్ కేవల్ రాములు,

# జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖకు రాష్ట్రస్థాయి అవార్డులు.




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థకు 2 రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. బుధవారం హైదరాబాదు గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో శ్రీనిధి 12వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను, శ్రీనిధి రుణాల వసూలు 88 శాతం, క్రెడిట్ ప్లాన్ అచీవ్మెంట్ లో 105 శాతం లక్ష్యాలను సాధించి ఉత్తమంగా నిలిచినందుకుగాను రాష్ట్రంలోనే రెండవ స్థానం అవార్డు లభించింది. లోకేశ్వరం మండలం ప్రగతి మండల సమాఖ్యకు ఉత్తమ మండల సమస్యగా రాష్ట్రంలో రెండు స్థానం దక్కింది. కాగా జిల్లాకు వరుసగా నాలుగో సంవత్సరం అవార్డు లభించింది. ఈ అవార్డులను డిఆర్డిఓ తరపున జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు సాగర, ఎపిఎం మల్లేష్ లు రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క, చేతుల మీదుగా అందుకున్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





ఇఫ్తార్ విందులో పాల్గొన్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయితీ రాజ్ అధికారుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. వివిధ జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి విందును స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలంతా అన్ని పండుగలను కలిసికట్టుగా సహోదర భావంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని మతాల సారం ఒకటేనని, ప్రజలంతా కలిసికట్టుగా ఉంటూ దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. సమాజ సేవ, దయాగుణం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు.

ముస్లింలకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రత్న కళ్యాణి, జిల్లా అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

అమృత్ తెలంగాణ: పెద్దవంగర గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బావోజీ తండాకు చెందిన బానోత్ పంతులు నాయక్ (70) మేకలు మేపుతూ భార్య బాజు తో కలిసి జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం చిన్నవంగర ఎక్స్ రోడ్డు సమీపంలోని కిరాణా షాపుకు వెళ్ళి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది.

# నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.







అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలించారు. హౌస్ డిజైన్, ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై అధికారులకు కీలక సూచనలను చేసారు. నిర్మాణ నాణ్యతను మెరుగుపరచాలని, పనులను వేగంగా పూర్తి చేయాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇండ్లు లేని పేదవారికి ఇండ్లను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. అన్ని మండలాల్లో నిర్మించ తలపెట్టిన నమూనా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారుల సర్వే కొనసాగుతోందని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎంపీ డివో కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ, పట్టణ పరిధిలో ఆస్తిపన్ను వసులును వందశాతం పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. ఎల్ ఆర్ ఎస్ కు ఈనెల 31 వరకు గడవు ఉన్నందున దస్తుదారులు 25 శాతం లబ్ధి పొందేలా ఎల్ఆర్ఎస్ పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వాగులు, నది పరివాహక ప్రాంతాలలో ఇసుక రీచ్ లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో సునీత, ఎంపీఓ రత్నాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లాలోని ముస్లిం సోదరులకు మరియు వారి కుటుంబ సభ్యులకు పవిత్ర "రంజాన్" (ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా ముందస్తుగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ఈరోజు నిర్మల్ పట్టణంలో పనిచేస్తున్న ముస్లిం సోదరులకు రంజాన్ మాస ఉపవాసాల సందర్భంగా జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...

30 రోజులు నమాజ్ మరియు ఉపవాస దీక్షలు పూర్తి చేసుకొంటూ మరియు తమ విదులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా పోలీస్ అధికారులు అందరూ సహకరించినందుకు ధన్యవాదలు. రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 02 నుండి ప్రారంబం అయ్యాయి , ఒక నెల పాటు ఉపవాసం ఉంది అల్లా ను ప్రార్దిస్తారు. రంజాన్ మాసం లో ముస్లిం సోదరులు ఎక్కువ సమయం ప్రార్ధనలు చేస్తారు . ఇస్లాం యొక్క అయిదు సూత్రాలలో ఉపవాసం ఒకటి. కుటుంబం మరియు స్నేహితులతో కలసి భోజనం చేస్తారు . ఏదయినా తప్పులు జరిగితే క్షమించమని అల్లాహ్ ను ప్రార్దిస్తారు. సాయత్రం ఉపవసనికి ముగించటానికి చేసేది ఇఫ్తార్ . ఈ ఇఫ్తార్ విందులో పోల్గోన్నదుకు అందరికి కృతజ్ఞతలు. ఈ కార్యక్రమలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, అవినాష్ కుమార్ ఐపిఎస్, రాజేష్ మీన ఐపిఎస్, ఏ.ఒ యునుస్ అలి, ఇన్స్పెక్టర్ లు అజయ్ కుమార్, గోవర్ధన్ రెడ్డి, నైలు, గోపినాథ్, ప్రేమ్ కుమార్, ప్రవీణ్ కుమార్, కృష్ణ, మల్లేష్, సమ్మయ్య, ఆర్ ఐ లు రాం నిరంజన్, శేఖర్, రామకృష్ణ, రమేష్, అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్.ఎచ్.ఓ లు ఆర్.ఎస్ఐ లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# భైంసా పట్టణంలో లో భరోసా

## జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్., భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో





అమృత్ తెలంగాణ భైంసా న్యూస్ : భరోసా సెంటర్ లొ అనుభజ్ఞులైన కౌన్సిలర్స్ చేత కౌన్సెలింగ్ ప్రారంభం . కొన్ని కేసులలో క్షణికావేశంలో దూరంగా ఉంటున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వారి మనస్పర్ధలు దూరం చేయటం కోసం భరోసా సెంటర్ ను ప్రారంభించి ఈ రోజు కొంత మంది కి కౌన్సెలింగ్ ఇవ్వటం జరిగింది. ప్రతి బుదవారం భరోసా సిబ్బంది భైంసా పట్టణం లోని క్యాంప్ కార్యాలయం లో అందుబాటులో ఉంటారు. ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి బుధవారం భైంసా పట్టణం లోని ఎస్పి క్యాంప్ కార్యాలయం లో ఈ రోజు గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి భైంసా సబ్ డివిజన్ లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....

ప్రతి బుధవారం భరోసా సెంటర్ సిబ్బంది అందుబాటులో ఉంటారు కాబట్టి అనుభవజ్ఞులైన కౌన్సిలర్ ల యొక్క సేవలు వినియోగించుకోవాలని తెలియజేసారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో అవినాష్ కుమార్ ఐపిఎస్, ఇన్స్పెక్టర్ లు నైలు, గోపినాథ్, మల్లేష్, భరోసా సెంటర్ సిబ్బంది జ్యోతి, శిరీష, క్యాంప్ ఇన్చార్జి రఘువీర్ పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి యావజీవ కారాగార శిక్ష, రూ 1000/- జరిమానా.

**18 మంది సాక్షుల విచారణ**

**శిక్ష విధించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్ రావు.**

**సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ప్రతిరోజు నేరం చేసే వారికి ఖచ్చితంగా శిక్ష పడుతుందనే నమ్మకం న్యాయస్థానం ద్వారా లభిస్తుందని, చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరు సమానమేనని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం దృష్టి నుండి తప్పించుకోలేరని తెలిపారు.

వివరాలలో 2022 సంవత్సరం ఆగస్టు 21వ తారీఖున సాయంత్రం ఐదు గంటల 15 నిమిషాలకు రాంపూర్ టి జైనథ్ మండలానికి చెందిన నేరస్తుడు కొడిమెల ప్రభాకర్ S/O జంగయ్య అనే వ్యక్తి పాత కక్షలు మనసులో ఉంచుకొని ఉట్ల రమేష్ S/O ఆనందరావు అనే వ్యక్తిని స్థానిక బుద్ధ విహార నందు విచక్షణారహితంగా కుట్రపూరితంగా కత్తితో పొడిచి, కొట్టి చంపేసినాడు. ఈ సంఘటనపై జైనథ్ పోలీస్ స్టేషన్ నందు ఎస్సై బి పెర్సిస్ కేసు నమోదు చేయగా, అప్పటి జైనథ్ సిఐకే నరేష్ కుమార్ సాక్షులను విచారించి నేరస్తునిపై చాజీషీటు దాఖలు చేయగా, ఈ కేసు నందు విచారణ జరపగా కోర్టులైజర్ అధికారి ఎం గంగా సింగ్ మరియు కోర్టు డ్యూటీ అధికారి ఎంఏ జమీర్ 18 మంది సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేకల మధుకర్ గారు విచారించి నిందితునిపై నేరం రుజువు చేయగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ కె ప్రభాకర్ రావు గారు నిందితునిపై యావ జీవ కారాకార శిక్ష మరియు వెయ్యి రూపాయల జరిమానా విధించడం జరిగింది. ఇట్టి కేసు నందు నేరస్తునికి శిక్ష పడడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కోర్టు డ్యూటీ అధికారిని కోటి లైసెన్డికారిని మరియు పిపి గారిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించడం జరిగింది.

# వైద్య ఆరోగ్యశాఖలో నేటి నుంచి బయోమెట్రిక్ హాజరు


అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రేపటి నుంచి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల లో బయోమెట్రిక్ అటెండెన్స్ అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు. గతంలోనే అన్ని ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ ద్వారా హాజరును పర్యవేక్షించడం జరిగిందని అయితే సాంకేతిక ఇబ్బందుల వల్ల బయోమెట్రిక్ మరమ్మత్తుల వల్ల కొంతకాలంగా కొన్ని ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ పనిచేయలేదని తెలిపారు. వాటన్నిటిని కూడా మరమ్మత్తులు చేయించి అవసరమైన చోట కొత్త వాటిని బిగించి ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ హాజరును రేపటి నుంచి అమలు చేస్తున్నట్టు తెలిపారు.



జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్

## నవోదయలో సత్తా చాటిన స్లేట్ ఎక్సలెన్స్ విద్యార్థులు

జన్నారం :అమృత్ తెలంగాణ: ఇటీవలే వెలువడిన నవోదయ పరీక్షా ఫలితాల్లో మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన డి.అభిరామ్,డి.విశ్వసాయి, ఆర్ భరద్వాజ్ లు నవోదయ కు ఎంపికైనట్లు స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నవోదయ ఎంపికైన ఆ ముగ్గురు విద్యార్థులను చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు. గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడానికి కృషి చేస్తున్నామని,



వారిని అన్ని రంగాలలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్యామ్లాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కంటి సమస్య ఉంటే అద్దాలు వాడాలి..

జన్నారం : అమృత్ తెలంగాణ: కంటి సమస్య ఉన్న విద్యార్థులు కంటి అద్దాలను తప్పకుండా వాడాలని ఆర్బీఎస్కే జిల్లా సహాయ అధికారి గౌరీ శంకర్ సూచించారు. బుధవారం జన్నారం మండలంలోని కలమడుగు గ్రామ జడ్పీ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 24 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళి, ఆర్ బి ఎస్ కే అధికారులను అభినందించారు.



విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసిన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ పోచయ్య, ఉపాధ్యాయులు రమేష్ రాజేందర్ తిరుపతి కవిత తదితరులు పాల్గొన్నారు.

## మండల 'మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలి'

జన్నారం : అమృత్ తెలంగాణ: జన్నారం మండలం లోని దేవునిగూడెం, సింగరాయపేట చింతాగూడ, కలమడుగు పొనకల్ క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న మహిళా రైతులు ప్రభుత్వం సబ్సిడీపై అందించే వ్యవసాయ పనిముట్లు, యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని మహిళా రైతుల కోసం ప్రభుత్వం బ్యాటరీ, మాన్యువల్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్, రొటేటర్ లాంటి పరికరాలను సబ్సిడీపై మంజూరు చేసిందన్నారు.

ఆసక్తిగల మహిళా రైతులు మార్చి 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే రైతులు, ధరకాస్తుతో పాటు ఫోటో పట్టా పాస్బుక్ జీరాక్సు డిడిఆధార్ కార్డు జీరాక్సు బాంక్పాస్బుక్జీరాక్సుట్రాక్టర్పనిముట్లైతే ఆర్సి జాతచేయవలను. రైతులకు ఎలాంటి అనుమానాలు ఉన్న మండల వ్యవసాయ



శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## 45 పీఎం శ్రీ పాఠశాలలకు దరఖాస్తుల ఆహ్వానం..

అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: కేంద్రప్రభుత్వం నిధులచే నూతన విద్యా విధానానికి అనుగుణంగా అభివృద్ధి చేసే పథకంలో భాగంగా నిర్వహించే పీఎం శ్రీ పాఠశాలలు 7వ ఫేజ్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి మరో 45 పాఠశాలలకు దరఖాస్తు చేసుకునే అవకాశం వచ్చింది. ఇప్పటికే ఈ పథకం లో జిల్లాలో ఒకటో ఫేజ్ లో 20,రెండో ఫేజ్ 4 మొత్తం 24 పాఠశాలలు ఈ నిధులు చే అభివృద్ధిపథంలో నిర్వహిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుండి మరో 45 బెంచ్ మార్క్ స్కూల్స్ నుండి కేంద్రం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పీఎం శ్రీ నియమావళి ప్రకారం దరఖాస్తు లు ఆన్లైన్ చేసారు. ఈ పథకానికి ఎంపికైతే నాలుగు విద్యా సంవత్సరాలకు కలుపుకుని ఒక్కో పాఠశాలకు ప్రాథమిక పాఠశాలలకు రూ.19 లక్షలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.1 కోటీ 20 లక్షలు, ఉన్నత పాఠశాలలకు రూ.2



కోట్లు నిధులు మంజూరు అవుతాయి. ఈ నిధులతో ఆయా పాఠశాలలకు భవన సముదాయాలు, క్రీడా మైదానాలు, సాంకేతిక విద్యా బోధనకు అనుగుణంగా పరికరాలు,14 అంశాల్లో తీర్చిదిద్దుతారు. ఈ దరఖాస్తులను ఆయా మండల విద్యాధికారులు ఈ నెల 26,27 తేదీల్లో ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం వాటిని జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిస్తారు. జిల్లా విద్యాశాఖ అధికారి ధ్రువీకరణ చేసిన తర్వాత రాష్ట్ర స్థాయిలో నూతన పిఎం శ్రీ పాఠశాలల ఎంపిక జరుగుతుంది. ఆల్లపల్లి, చంద్రుగొండ, చర్ల, గుండాల, చుంచు పల్లి, కొరకు గూడెం, మణుగూరు, సుజాత నగర్ మండలాలకు ఒక్కొక్కటి, భూర్గంపాడు, ములకలపల్లి, టేకులపల్లి, ఇల్లందు మున్సిపాలిటీలలో రెండేసి, అన్నపు రెడ్డి పల్లి, అశ్వారావుపేట, భద్రాచలం, జూలూరుపాడు, ఇల్లందు మండలాల్లో మూడేసి, పాల్వంచ మండలానికి నాలుగు, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలకు ఐదేసి చొప్పున మొత్తం 45 పాఠశాలలను బెంచ్ మార్క్ గుర్తించి ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరించారు.

# రైతులనుకుంటే ప్రభుత్వాలను దించగలరు

నిజామాబాద్:అమృత్ తెలంగాణ: రైతులు అనుకుంటే ప్రభుత్వాలను గద్దె నెక్కించగలరు.. గద్దె దించగలరని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య అన్నారు. స్వామినాథన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడవ రాష్ట్ర మహాసభలు నిజామాబాద్‌లోని బీఎల్ఎన్ గార్డెన్‌లో ప్రారంభమ య్యాయి. ఈ కార్యక్రమంలో వైస్‌ఛాన్సలర్ అల్దాస్ జానయ్య, అఖిలభారత రైతు సంఘం ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, వ్యవసాయ విశ్లేషకులు, సోమర్ల వ్యవసాయ శాస్త్రవేత్త దొంతి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్దాస్ జానయ్య మాట్లాడుతూ.. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా 35 దేశాలు తిరిగి రైతుల గురించి అధ్యయనం చేశామని, అక్కడ కూడా రైతులకు ఇలాంటి పరిస్థితులే ఉన్నప్పటికీ మన దేశంలో ఇంకా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో రైతు భరోసా ఇచ్చి, రైతుకు ప్రోత్సాహక రాయితీలు అందించాలన్నారు. మొండి బకాయిల కింద 2014 నుంచి రూ.16 లక్షల కోట్లు కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇచ్చిన వాటిని వసూలు చేసి రైతన్నల కోసం ఖర్చు చేస్తే వికసిత్ భారత్ సాధ్యమవుతుందన్నారు. అఖిల భారత రైతు సంఘం ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులు పండించే పంటలు, వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేస్తే కోట్ల రూపాయల లాభం వస్తుందని, అలాంటిది మోడీ కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేస్తోందని విమర్శించారు. రానురాను రైతుల భూములు పూర్తిగా లాక్కొని తామే పంట పండించుకునేలా కార్పొరేట్లు చూస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన



తర్వాత ధరణి చట్టం అమలు చేశారని ఇందులో 64 లక్షల మంది రైతులు ఉంటే 18 లక్షల మంది రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వలేదని 6 లక్షల ఖాతాలు తప్పుల తడకలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ భారతి చట్టం చేశారని, కానీ ఇంతవరకు చట్టానికి విధి విధానాలు లేవని, ధరణిలో 21 సెక్షన్లు ఉంటే భూభారతిలో 23 సెక్షన్లు చేశారని అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను అధ్యయనం చేయాలని తెలిపారు.

# తెలంగాణ జానపద అకాడమీని ఏర్పాటు చేయాలి



ముషీరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ జానపద అకాడమీని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో 11 ఏండ్లుగా కళాకారులకు 'సంక్షేమం' అంటే తెలియని సాంస్కృతిక రంగం-బడ్జెట్ అంశంపై హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. టీపీఎస్‌కే, పీఎన్ఎం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పీఎన్ఎం కార్యదర్శి ఎన్.మారన్న అధ్యక్షత వహించారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణలో ఆట పాట ప్రజలకు వెన్నతో పెట్టిన విద్య అని, ఇక్కడ పాటలే ముందుండి ప్రజలను నడిపించాయని అన్నారు. 11 ఏండ్లుగా తెలంగాణ కళాకారుల పట్ల పాలకులు నిర్లక్ష్యం చూపారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత బడ్జెట్‌లో రూ.74 కోట్ల 35 లక్షలు సాంస్కృతిక రంగానికి కేటాయించిందని తెలిపారు. ఇందులో సాంస్కృతిక సారథి కళాకారుల వేతనాలు, సాంస్కృతిక రంగం జీతభత్యాల నిర్వహణ కిందనే రూ.34 కోట్ల 35 లక్షలు పోతాయని, మిగతా రూ.40 కోట్లు ఎవరికి ఖర్చు చేశారో లెక్కలు చెప్తారా ? అని ప్రశ్నించారు. కట్ట నర్సింహా మాట్లాడుతూ.. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఒక మాయ అని విమర్శించారు. వృద్ధాప్య పింఛన్ల కోసం రూ.13కోట్లు కేటాయిస్తే.. ఆరు కోట్ల రూపాయలు ఇచ్చినట్టు గణాంకాలు చూపుతున్నారని, మిగతా ఏడు కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ నాటకరంగం కళాకారులు కె.శాంతారావు మాట్లాడుతూ.. కళాకారులకు గుర్తింపు కార్డులు లేవు, పింఛన్లు లేవు, ఇండ్లు లేవు, బస్సు, రైల్వే ప్రయాణ సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జానపద వృత్తి కళాకారులకు శివరాత్రి జాగారం సందర్భంగా గౌరవ వేతనం లేదని తెలిపారు. కళాకారుల జేఏసీ కన్వీనర్ మురళీధర్ దేశ్ పాండే మాట్లాడుతూ.. తెలంగాణలో పట్టెడన్నం పాత వస్త్రాలు కళాకారులకు.. పదవులు పట్టాభిషేకాలు పాలకులకా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు రాకేష్ రావణ్, తెలంగాణ ప్రజానాట్య మండలి సభ్యులు శ్రీనివాస్, సాంబరాజు, యాదగిరి, పి.కళ్యాణ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వి.ఆనంద్, ఆశన్న, టీపీఎస్‌కే సభ్యులు జి.నరేష్, పి.రాజయ్య, తెలంగాణ సాంస్కృతిక సంఘం డప్పు స్వామి, జానపద వృత్తి కళాకారుల సంఘం కె.భాస్కర్, కళాకారిణి గిరిజ తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు..

అచ్చంపేట :అమృత్ తెలంగాణ: అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అచ్చంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ అబ్దుల్ సుభార్ అన్నారు. సోమవారం నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. అచ్చంపేట ఫారెస్ట్ రేంజ్ పరిధి 2800 హెక్టార్లు విస్తరించి ఉందన్నారు. రంగాపూర్ , కొండనాగుల, ఐనోల్, ఘనపూర్, సిద్దాపూర్ ఐదు సెక్షన్ లుగా విభజించడం జరిగింది అన్నారు. వన్యప్రాణుల దాహం కోసం గ్రామాల్లోకి రాకుండా ప్రస్తుత వేసవిని దృష్టిలో పెట్టుకొని వన్యప్రాణుల త్రాగునీటి కోసం చెక్ డ్యామ్ లు -2, ఫర్కులేషన్ ట్యాంకులు-5 నిర్మాణం చేస్తున్నామని, వీటిని సోలార్ మోటార్ ద్వారా నీటితో నింపడం జరుగుతుందన్నారు. మరో 11 ఫర్కులేషన్ ట్యాంకుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వన్యప్రాణుల సంచార వివరాలు తెలుసుకునేందుకు కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వేటగాళ్లపైన ప్రత్యేక నిఘా పెంచామని, బ్రాహ్మణపల్లి శివారులో గత నెలలో అడవి మాంసాన్ని తీసుకొచ్చిన ఐదు మందిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు




పరచడం జరిగిందన్నారు. అదేవిధంగా అడవిని నరికితే ఫారెస్ట్ చట్టాలు ఉపయోగించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

భువనగిరి :అమృత్ తెలంగాణ: ఏప్రిల్ 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి జయంతి ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఏప్రిల్ 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి భీమ్ యాత్రను యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని బట్టుపల్లి అనురాధ బట్టు రామచంద్రయ్య తెలిపారు. బుధవారం జగ్జీవన్ రామ్ భవనంలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్ 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఏప్రిల్ 11న




మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఏప్రిల్ 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి భీమ్ యాత్రను జయప్రదం చేద్దాం అని అన్నారు. ఈ నెల 29 న మూడోవ సమావేశం జగ్జీవన్ రామ్ గారి భవనంలో సమీక్ష సమావేశం కలదన్నారు. ఈ కార్యక్రమంలో బండారు అశోక్ వర్ధన్, సిరిపంగా శివలింగం, ఇటుకల దేవేందర్, బానోత్ భాస్కర్ నాయక్, బర్రె నరేష్, నాగారం శంకర్, సిల్వర్ జైపాల్, అనంపట్ల కృష్ణ, దుబ్బ రామకృష్ణ, బాసాని పాల్గొన్నారు.

# బీసీ కమిషన్ ఛైర్మన్, సభ్యులను కలిసిన మైలారం రాము..

వేములవాడ :అమృత్ తెలంగాణ: చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ ఆమోదం హర్షణీయమని రాష్ట్ర రజక సంఘం కన్వీనర్ మైలారం రాము అన్నారు. బుధవారం వేములవాడలో పర్యటిస్తున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్, వారి బృందాన్ని రాష్ట్ర రజక సంఘం కన్వీనర్, వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మైలారం రాము మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు చేపడుతున్నటువంటి సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మైలారం రాము మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో చారిత్రాత్మక మైనటువంటి బీసీ రిజర్వేషన్ బిల్లు చట్టసభల్లో ఆమోదం పొందడం బీసీ కులాలకు శుభ పరిణామం అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ పేరును కోటిలోని మహిళా యూనివర్సిటీకి ప్రతిపాదించడం చాలా గొప్ప విషయమని, ఇది యావత్ రజక కులానికి గర్వకారణమని కొనియాడారు. అనేకమంది బీసీ కులాలు ఇప్పటికి కూడా చేతివృత్తులపైనే ఆధారపడుతున్నారని, వారి ఆర్థిక సామాజిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్ ద్వారా మరింతగా తోడ్పాటు అందిస్తే బీసీ కులాలు అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని ఆయన ఆకాంక్షించారు. బీసీల అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలియజేశారు. వారి వెంట స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు బిసి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎద అందాలతో రామ్ చరణ్ హీరోయిన్ రచ్చ



బాలీవుడ్ నటి ఈషా గుప్తా గ్లామర్ సెన్సేషన్ గా మారిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో హాట్ అండ్ బోల్డ్ అందాలను వడ్డిస్తూ క్రేజ్ సంపాదించుకుంది. నటిగానే కాకుండా స్పెషల్ సాంగ్స్ కూ కేరాఫ్ అడ్రస్ గా మారింది ఈ ముద్దుగుమ్మ రామ్ చరణ్ తేజ్ నటించిన వినయ విధేయ రామ చిత్రంలో స్పెషల్ అపియరెన్స్ తో ఈ భామ తెలుగు ఆడియెన్స్ ను అలరించింది. ఈ స్పెషల్ సాంగ్ లో ఈషా అందాల బోరతకు కుర్రకారు ఫిదా అయ్యారు. నిజం చెప్పాలంటే ఈ హార్ట్ పాప గ్లామర్ షో చూస్తే తట్టుకోవడం కష్టమే. అందాలను విందు చేయడంలో ఈషా స్టైలే వేరు. న్యూడ్ గా కనపడటం ఈషాకు కొత్తేమీ కాదు. టూ పీస్..బికినీ.. అర్ధనగ్న- నగ్న పోజులు అంటూ ఎప్పటికప్పుడూ హాట్ టాపిక్ గా మారుతోంది. అయితే తాజాగా ఈ భామ తన కొత్త గ్లామర్ పిక్స్ ను అభిమానులతో పంచుకుంది. బ్లాక్ అండ్ వైట్ కలర్ ఫొటోస్ ను షేర్ చేసింది. ఇందులో ఈషా బ్లాక్ డ్రెస్ లో కనువిందు చేసింది. క్లీవేజ్ షో ట్రీట్ ఇచ్చింది. ఉప్పొంగే ఎద అందాలను చూపిస్తూ యూత్ కు ఈ చలికాలంలో వేడి పుట్టించింది. వారి హృదయాలను పిండేసింది. ఇక ఈ ఫొటోస్ కు స్టార్ డస్ట్ నైట్స్ అంటూ క్యాప్షన్ జొడించింది. ఇంకా ఆ నడుము సొగసు చూపిస్తున్న విధానం మైండ్ బ్లోయింగ్. అలా తన క్లీవేజ్ అందాలతో కుర్రకారుని మరోసారి కట్టిపడేసింది. ఇక ఇది చూసిన నెటిజన్స్ ఆగుతారా... ఆమె కామెంట్ బాక్స్ లో ఫైర్ గుర్తులతో నింపేశారు. కొంత మంది హార్ట్ ల వర్షం కురిపించారు. ఇక మరికొంత మంది సూపర్ గా సెక్సీగా ఉన్నారు అంటూ కామెంట్స్ పెడుతున్నారు. ఇక ఈ ముద్దుగుమ్మ కెరియర్ విషయానికొస్తే.. మోడల్ గా స్టార్ట్ చేసి ప్రస్తుతం బాలీవుడ్ హీరోయిన్ గా కెరీర్లో రాణించడానికి ప్రయత్నాలు చేస్తుంది. అయితే ప్రస్తుతం సరైన సినిమాలు లేక ఒకటి రెండు చిత్రాల్లో నటిస్తోందిగానీ.. గతంలో వరుస హిందీ చిత్రాల్లో నటించి కుర్రకారును తనవైపు తిప్పుకుంది. సినిమాలే కాకుండా ఈషా టీవీషోల్లోనూ పాల్గొంటుంది. అలాగే వెబ్ సిరీస్ లలోనూ నటిస్తోంది. 2020 రిజెక్ట్ ఎక్స్ వెబ్ సీరిస్ లోకి అడుగుపెట్టింది.

# వారం గ్యాప్‌లో ఆమె జాతకం తేలిపోనుంది!

టాలీవుడ్‌లో సుధీర్ బాబుతో కలిసి 'ఎస్ఎంఎస్' సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ రెజీనా కాసాండ్రా. టాలీవుడ్‌లో సుధీర్ బాబుతో కలిసి 'ఎస్ఎంఎస్' సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ రెజీనా కాసాండ్రా. తక్కువ సమయంలోనే తెలుగు, తమిళ్, కన్నడంలో ఎక్కువ సినిమాలు చేసిన ముద్దుగుమ్మగా నిలిచింది. రెజీనా టాలీవుడ్‌లో ఒకానొక సమయంలో యంగ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచింది. పలువురు టాలీవుడ్ యంగ్ స్టార్ హీరోలతో సినిమాల్లో నటించింది. కానీ స్టార్ హీరోలతో కలిసి నటించే అవకాశం ఈ అమ్మడికి దక్కలేదు. దాంతో స్టార్ హీరోయిన్ ఇమేజ్ సొంతం చేసుకోకుండానే టాలీవుడ్‌లో మీడియం రేంజ్ హీరోయిన్‌గా నిలిచింది. స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కకున్నా వచ్చిన ఆఫర్లను సద్వినియోగం చేసుకుంటూ కెరీర్‌లో ముందుకు సాగుతుంది. 100కోట్ల డిజాస్టర్ తరువాత మరో లక్కీ ఛాన్స్? ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపు 20 ఏళ్లు అవుతుంది. రెజీనా రెండు మూడు హిందీ సినిమాలు చేసినప్పటికీ పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. సౌత్ సినిమాల్లో



ఇప్పటికే ఒక స్థాయిలో గుర్తింపు ఉన్న ఈ అమ్మడు బాలీవుడ్‌లో మరోసారి గుర్తింపు కోసం ప్రయత్నాలు చేస్తుంది. రెజీనా త్వరలో రెండు హిందీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ నటుడు సన్నీ డియోల్ నటించిన 'జాట్' సినిమా విడుదలకు సిద్ధం అయింది. ఆ సినిమాలో రెజీనా కీలక పాత్రలో కనిపించబోతుంది. ఏప్రిల్ 24న జాట్ సినిమా బాలీవుడ్ ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో రెజీనా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. పాసయినట్లేనా.. జాట్ సినిమాతో పాటు రెజీనా హిందీలో మరో పెద్ద హీరోతో కలిసి నటించింది. సూపర్ హిట్ అయిన కేసరి సినిమా ఫ్రాంచైజీలో రాబోతున్న అక్షయ్ కుమార్ 'కేసరి చాప్టర్ 2' సినిమాలో రెజీనా నటించిందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు చిత్ర యూనిట్ సభ్యులు ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. కానీ రెజీనా పాత్రను సస్పెన్స్‌గా ఉంచుతున్నారని తెలుస్తోంది. స్వతంత్ర్య ఉద్యమ సమయంలో జరిగిన జలియన్ వాలాబాగ్ ఊచకోత బాధితుల కోసం పోరాడిన న్యాయవాది, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సి శంకరన్ నాయర్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమాను రూపొందించారు. సి శంకరన్ నాయర్ భార్య పాత్రలో రెజీనా కనిపించబోతుంది అనే వార్తలు వచ్చాయి. కేసరి 2 సినిమాను ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు జరిగాయి.

# 100కోట్ల డిజాస్టర్ తరువాత మరో లక్కీ ఛాన్స్?

సౌత్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటిగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్‌కు బాలీవుడ్ ఎంట్రీ పెద్ద నిరాశను మిగిల్చింది. సౌత్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటిగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్‌కు బాలీవుడ్ ఎంట్రీ పెద్ద నిరాశను మిగిల్చింది. అట్లీ దర్శకత్వం వహించిన తమిళ బ్లాక్‌బస్టర్ 'తెరి' ఆధారంగా తెరకెక్కించిన హిందీ చిత్రం బేబీ జాన్. అయితే ఈ సినిమా ద్వారా ఆమె హిందీ పరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఇందులో ఆమెకు వన్ ఆఫ్ ది లీడ్ పాత్రే అయినా, సినిమా ఫెయిల్యూర్‌తో పాటు ఆమె నటన కూడా విమర్శలు ఎదుర్కొంది. వరుణ్ ధవన్, జాకీ ష్రాఫ్ లాంటి స్టార్‌లతో కూడిన భారీ బడ్జెట్ మూవీ అయినా, కేవలం రూ.39.28 కోట్లే వసూలు చేయడం అందరికి షాక్ ఇచ్చింది. ఇక దాదాపు రూ.160 కోట్ల బడ్జెట్ ఉన్న ఈ చిత్రానికి భయంకరమైన లాస్ కలిగించింది. ముఖ్యంగా కీర్తి సురేష్ పోషించిన డాక్టర్ మీర వర్మ పాత్ర ప్రేక్షకులలో ఎమోషనల్ కనెక్షన్ రాకపోవడం గమనార్హం. ఆమె నటనపై కూడా విమర్శలు వచ్చాయి. మహానటితో మెప్పించిన ఆమె ఈ సినిమాలో మెరుగ్గా కనిపించలేదన్న అభిప్రాయం స్పష్టంగా వ్యక్తమైంది.



## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# తమిళ్ పీరియాడిక్ డ్రామాలో మృణాల్ కు క్రేజీ ఆఫర్!



దుల్కర్ సల్మాన్ తో హను రాఘవపూడి తెరకెక్కించిన ఎపిక్ లవ్ స్టోరీ 'సీతారామం'. 'యుద్ధం తో రాసిన ప్రేమకథ' అనే క్యాప్షన్ తో విడుదలైన ఈ మూవీ సంచలన విజయాన్ని సొంతం చేసుకోవడమే కాకుండా విమర్శకుల ప్రశంసల్ని సైతం సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని రాబట్టింది. ఈ మూవీతో టాలీవుడ్ కు పరిచయమైన బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ సీత పాత్రలో ఒదిగిపోయి నటించిన తీరు ప్రతీ ఒక్కరి హృదయాన్ని స్పృశించింది. దీంతో టాలీవుడ్ ప్రేక్షకుల హృదయాల్లో మృణాల్ సీతగా మారిపోయింది. ఈ మూవీ తరువాత భారీ క్రేజ్ ని దక్కించుకున్న మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా కొత్త దర్శకుడు తెరకెక్కిస్తున్న మూవీలో నటిస్తోంది. సెలెక్టీవ్ గా సినిమాలు చేస్తూ తన ప్రత్యేకతని చాటుకుంటున్న ఈ మరాఠీ సోయగం తాజాగా తమిళంలో తెరకెక్కుతున్న క్రేజీ పాన్ ఇండియా మూవీలో నటించే అవకాశాన్ని దక్కించుకున్నట్టుగా తెలుస్తోంది. టీవీ సీరియల్స్ తో నటిగా కెరీర్ ప్రారంభించిన మృణాల్ హీరోయిన్ గా భిన్నమైన పాత్రల్లో మాత్రమే నటించాలని కోరుకుంటోందట. అందులో భాగంగానే విభిన్నమైన పాత్రలకు కథలకు మాత్రమే గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇందులో భాగంగానే తమిళ హీరో సూర్యతో 'సిరుతై' శివ కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో పీరియాడిక్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్న మూవీకి మృణాల్ ఠాకూర్ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది. స్టూడియో గ్రీన్ యువీ క్రియేషన్స్ బ్యానర్ పై కె.ఇ. జ్ఞానవేల్ రాజా ఈ మూవీని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్న ఈ మూవీలో హీరోయిన్ గా బాలీవుడ్ బ్యూటీ దిషా పటాని నటిస్తోంది. అయితే మరో కీలక పాత్రలో మృణాల్ ఠాకూర్ ని ఎంపిక చేసుకున్నారట. ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ లకు సంబంధంచిన కీలక ఘట్టాల్లో మృణాల్ కీలకంగా కనిపించనుందని తెలుస్తోంది. రీసెంట్ గా దర్శకుడు శివ చెప్పిన స్టోరీ నచ్చడంతో మృణాల్ ఈ ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది. ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్ లో మృణాల్ సెట్ లోకి ఎంటర్ కానున్నట్టుగా తెలిసింది. దేవి శ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ మూవీకి వెట్రి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. హీరో సూర్య ఈ మూవీలో విభిన్నమైన గెటప్ లలో కనిపించి అబ్బుర పరచనున్నాడని తెలిసింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com